కాలిబాట.. దిగుబడికి రాచబాట

- సస్యరక్షణపై అధికారుల సూచనలు
- ముమ్మరంగా రబీ సాగు
- పనుల్లో రైతులు నిమగ్నం


పంట పొలంలో కాలిబాటలు వేస్తున్న కౌలురైతు

రాయవరం: ఖరీఫ్ కాలం ముగిసి రబీ పనుల్లో రైతులు బిజీ అయ్యారు. ప్రస్తుత సాగుకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోంది. అధిక దిగుబడుల కోసం వెదజల్లు విధానంలో సాగు చేపట్టాలని వ్యవసాయ శాఖ రైతులకు సూచిస్తోంది. దీంతో ఈ విధానానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. వరి నాట్లు వేసే సమయంలో రైతులు కాలిబాటలు వేయడం వల్ల చీడపీడల సమస్య తగ్గుతుందని అధికారులు సూచిస్తున్నారు. కాలిబాటలతో రైతులకు కలిగే ప్రయోజనాలను రాయవరం మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఆ బాటలు ఎందుకంటే..

- వరి సాగు చేస్తున్న రైతులు పొలంలో కాలిబాటలు వేయడం ద్వారా చేలకు గాలి, వెలుతురు సమృద్ధిగా అందుతుంది. తద్వారా పైరు ఆరోగ్యవంతంగా పెరుగుతుంది. గాలి సమృద్ధిగా అందడం వల్ల నీటిలో పెరిగే వరి మొక్కలు ఆక్సిజన్ తీసుకునేందుకు పెద్దగా శక్తిని ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు.
- తుపానులు, భారీ వర్షాలు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు పంట చేలల్లోని మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడులు పెరుగుతాయి.
- కాలిబాటలు వేసిన పొలంలో రైతులు సులభంగా పురుగు, కలుపు మందులు పిచికారీ చేసుకోవచ్చు. ఎరువులను సులభంగా వేసుకోవచ్చు.
- తరచూ పొలం మధ్యలో తిరిగి పంటను పరిశీలించే అవకాశం ఉంటుంది. అలాగే ఎలుకల వల్ల జరుగుతున్న నష్టాన్ని ఎప్పటికప్పుడు గమనించవచ్చు. పొలంలో నీటి పరిస్థితిపై ఒక అవగాహనకు వచ్చేందుకు వీలుంటుంది.
- పైరులో చీడపీడల ఉనికిని, ఉధృతిని అతి సమీపం నుంచి గమనించి తదనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చేపట్టేందుకు కూడా అవకాశం ఉంటుంది.
- కాలిబాటలు వేయడం వల్ల గాలి ప్రసరించి దోమ ఉధృతి తగ్గుతుంది.
- వరిలో విత్తనాలు వెదజల్లే ముందు ఇసుక బస్తాలను మూటలుగా కట్టి ప్రతి రెండు మీటర్లకు కాలిబాటలను ఏర్పాటు చేసుకోవాలి. ఇలా ఏర్పాటు చేసిన కాలిబాటలతో మురుగు నీటిని తొలగించడంతో పాటు అవసరమైన సమయంలో పంట పొలానికి నీరు పట్టుకోవడానికి బోదెలుగా వినియోగించవచ్చు.

యాజమాన్య పద్ధతులు అవసరం



కాలిబాటలు వేసుకునే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉంది. పొలంలో ప్రతి రెండు మీటర్లకు ఒక కాలిబాట చొప్పున 20 సెంటీమీటర్ల వెడల్పులో వేస్తే మంచి ప్రయోజనం ఉంటుంది. 6–7 మీటర్లకు ఒక కాలిబాట వేయడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. కాలిబాట వేయాల్సిన చోట ముందుగా మార్క్ చేసుకుని గట్లకు రెండువైపులా తాళ్లు కట్టి మార్క్ చేసిన చోట ఉన్న మొక్కలు తీసేస్తే అది కాలిబాట అవుతుంది. వెదజల్లే పద్ధతిలో కూడా పైరు ఎదుగుతున్న సమయంలో 15–20 రోజుల మధ్యలో 20 సెంటీమీటర్ల వెడల్పులో వరి మొక్కలను తొలగించి కాలిబాటలు వేసుకోవచ్చు.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

దేవస్థానం భూమి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న భూమిలో హెచ్చరిక బోర్డు పెడుతున్న దేవస్థానం అధికారులు

కె.గంగవరం: కుడుపూరు గ్రామంలో ఆక్రమణదారుల నుంచి దేవస్థాన భూమిని స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి చెందిన నాలుగెకరాల 21 సెంట్ల భూమి ఇప్పటి వరకూ ఆక్రమణదారుల చేతిలో ఉంది. ఈ విషయం గుర్తించి బుధవారం జిల్లా దేవదాయ శాఖ అధికారి కేఎస్‌వీడీ ప్రసాద్, ఈఓ ఎంవీవీ సత్యనారాయణ, వీఆర్‌ఓ బాలాజీ తదితరులు నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకున్నారు. అక్కడ ఆ భూమి దేవస్థానానికి చెందినదని ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. సదరు భూమిని దాళ్వా పంట కౌలుసాగుకు బహిరంగ వేలం నిర్వహిస్తామని ఈఓ తెలిపారు. ఈ భూమి సుమారు రూ. 2 కోట్లకు పైబడి ఉంటుందని అధికారులు చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొత్త కార్యవర్గం ఎన్నిక


మండల శెట్టిబలిజ సంఘ సభ్యులు వీరే..

రామచంద్రపురం: శెట్టిబలిజ సంఘ రామచంద్రపురం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శెట్టిబలిజ కల్యాణ మండపంలో బుధవారం సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండల శెట్టిబలిజ సంఘ అధ్యక్షునిగా వేగాయమ్మపేటకు చెందిన దొంగల శ్రీధర్, ఉపాధ్యక్షునిగా చిన తాళ్లపొలేనికి చెందిన నరాల సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీధర్ మాట్లాడుతూ సంఘ బలోపేతానికి తన వంతు కృషి చేస్తామన్నారు. త్వరలోనే మూడు మండలాలకు చెందిన నాయకులతో కలిసి తాలూకా శెట్టిబలిజ సంఘ కార్యవర్గాన్ని ఎన్నుకుంటామని తెలిపారు. కట్టా సూర్యనారాయణ, శెట్టిబలిజ సంఘం పట్టణ, కె.గంగవరం మండల, కాజులూరు మండల అధ్యక్షులు గుత్తుల వీరన్నశెట్టి, జుత్తుగ శ్యాంప్రసాద్, పెంకే విశ్వేశ్వరరావు, సీనియర్ నాయకులు బండి త్రిమూర్తులు, శీలం గంగరాజు, వాసంశెట్టి బాల, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, కాండ్రేగుల సాయి, కొప్పిశెట్టి నాగేంద్ర, దంగేటి వెంకట్రావు, పలివెల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

రామచంద్రపురం: రామానుజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో మేథమెటిక్స్ లైబ్రరీ, మేథమెటిక్స్ మ్యూజియం ద్వారా నిర్వహించిన 34వ జాతీయ గణిత టాలెంట్ సెర్చ్ కాంపిటీషన్‌లో మోడరన్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి జి.శ్రీసోమేష్ పట్టణంలో ప్రథమ స్థానం సాధించారు. ఈ విషయాన్ని మోడరన్ విద్యాసంస్థల అధినేత జీవీ రావు బుధవారం తెలిపారు. విజేతను హైస్కూల్ అకడమిక్ డైరెక్టర్ ఆర్.ఉమాదేవి, హెడ్ మాస్టర్ ఎం.చిట్టిబాబు తదితరులు అభినందించారు.

బాలుడి కుటుంబానికి చేయూత

కపిలేశ్వరపురం: దీపావళి పండుగ రోజున ప్రమాదానికి గురై చేతివేళ్లను పోగొట్టుకున్న కోరుమిల్లికి చెందిన బాలుడు సుంకర ప్రకాష్ కుటుంబానికి జనసేన కార్యకర్తలు రూ.32 వేల సాయాన్ని బుధవారం అందించారు. ఆ సొమ్మును పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ చేతుల మీదుగా బాలుడి కుటుంబానికి అందజేశారు. జనసేవాదళ్ మండల అధ్యక్షుడు తుట్టుపు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా మధుసూదనరావు

రాయవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా అప్పిని మధుసూదనరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. కోనసీమ జిల్లా ఏర్పడిన అనంతరం సమగ్ర శిక్ష ఏపీసీ పోస్టును భర్తీ చేయలేదు. ప్రస్తుతం డీఈఓ ఎం.కమల కుమారి సమగ్ర శిక్షా ఏపీసీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇదిలా ఉంటే డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన మధుసూదన రావును జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీగా నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు విడుదల చేశారు.

వినియోగదారుల సమస్యలు పరిష్కరించండి


మండపేటలో డిప్యూటీ తహసీల్దార్ పద్మకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

కపిలేశ్వరపురం: మండపేట మండలంలో గ్యాస్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ కోటిపల్లి సాయిరామ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ పద్మకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈకేవైసీ తప్పనిసరి పేరుతో గ్యాస్ వినియోగదారులు పట్టణంలోని ఏజెన్సీల వద్ద క్యూలైన్లలో పడిగాపులు పడుతున్నారన్నారు. ఏజెన్సీ ప్రతినిధులు వినియోగదారుల ఇళ్లకు వెళ్లి ఈకేవైసీ చేయాల్సి ఉన్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. పార్టీ నియోజకవర్గ కో కన్వీనర్ కంకటాల మురళీకృష్ణ, పట్టణ, రూరల్ అధ్యక్షులు మద్దుల సుబ్బారావు, రాయి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నిరసన

కపిలేశ్వరపురం (మండపేట): తమ డిమాండ్ల సాధనలో భాగంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో మండపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. సంఘ రాష్ట్ర కౌన్సిలర్ కె.గోపాలకృష్ణారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఆందోళనలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.సురేంద్రకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చైతన్య, రాష్ట్ర మాజీ కార్యదర్శి డీవీ రాఘవులు, సీఐటీయూ జిల్లా నాయకురాలు కె.కృష్ణవేణి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.రాజు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

రామచంద్రపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు వంటావార్పుతో నిరసన తెలిపారు. నాయకులు డీవీ రాఘవులు, సీతాదేవి, రాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను నిర్దేశించుకుని సాగాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి
- వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలకు అభినందన


చైర్‌పర్సన్ శ్రీదేవి చేతుల మీదుగా దేశ నాయకుల చిత్రపటాలను పాఠశాలకు అందజేస్తున్న సత్యనారాయణ

రామచంద్రపురం: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. స్థానిక చింతపల్లి సూరన్ననగర్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎం.మాధవ అధ్యక్షతన సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా శ్రీదేవి హాజరై మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా విద్యార్థులు చదువుకుని మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఇటీవల విద్యా వైజ్ఞానిక సదస్సులో జిల్లా స్థాయి అవార్డు అందుకున్న రామకృష్ణ, గ్రూప్ అవార్డు పొందిన విద్యార్థినీ విద్యార్థులను చైర్‌పర్సన్ శ్రీదేవి, కౌన్సిలర్ లలిత అభినందించారు. సోషల్ స్కూల్ అసిస్టెంట్ సూరంపూడి సూర్యకుమారి, రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ కోశాధికారి పెంకే సత్యనారాయణలు విద్యార్థుల కోసం దేశ, జాతీయ నాయకుల చిత్రపటాలను స్కూల్‌కు అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయురాలు ప్రసన్నకుమారి పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఇచ్చారు. దాతలను శ్రీదేవి, కౌన్సిలర్ లలిత అభినందించారు. ఉపాధ్యాయుడు నాయుడు, నాయకులు గుబ్బల సత్యనారాయణ బ్రదర్స్, కశా త్రినాథ్, కె.తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు విద్యార్థి ఎంపిక

కాజులూరు: రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌కు తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి తోట భద్రచలం ఎంపికైనట్లు కాజులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు చింతా నారాయణమూర్తి తెలిపారు. బుధవారం పాఠశాలలో స్కూల్ హెచ్‌ఎం పంపన కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. మంగళవారం జిల్లా స్థాయిలో కాకినాడలో జరిగిన సాంకేతిక ప్రదర్శనలో తమ విద్యార్థి తోట భద్రచలం అటల్ టింకరింగ్ ల్యాబ్ ద్వారా స్మార్ట్ హెల్మెట్ అనే ప్రాజెక్టును రూపొందించి జిల్లా ప్రథమ బహుమతి సాధించాడన్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ బహుమతి అందించారన్నారు.

మంత్రి వేణుకు వినతి


మంత్రి వేణుకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

రామచంద్రపురం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. తొలుత స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి నల్లచీరలు ధరించి కంచాలు మోగిస్తూ ర్యాలీగా మంత్రి వేణు ఇంటి వద్దకు చేరుకున్నారు. తమ సమస్యలను మంత్రి వేణుకు వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి తెలిపారు. ఏఐటీయూసీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి


గ్రంథాలయానికి అందజేసిన పుస్తకాలతో డాక్టర్ రమణ తదితరులు

రామచంద్రపురం: విద్యార్థులు అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని కాకినాడకు చెందిన సత్య స్కాన్ డయాగ్నోస్టిక్స్ సెంటర్ చీఫ్ రేడియాలజిస్ట్ డాక్టర్ కాదా వెంకటరమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి సుమారు రూ. 50 వేల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు గ్రంథాలయంలో లభ్యమయ్యే పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వై.పద్మజ, జువాలజీ లెక్చరర్ ఎస్ శ్రీనివాస్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు అల్లూరి సురేంద్ర, మలిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎంవీఆర్ ఫణీంద్ర, లైబ్రేరియన్ బీవీవీ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా..

- గ్రామాల్లో చురుగ్గా 'ఆడుదాం ఆంధ్రా'
- కాజులూరులో పోటీలను ప్రారంభించిన మంత్రి వేణు


కాజులూరులో వాలీబాల్ కోర్టును ప్రారంభిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ తదితరులు

కాజులూరు: క్రీడా స్ఫూర్తి ఉరకలేసింది.. ఉత్సాహం ఉవ్వెత్తున ఎగసిపడింది.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు రెండో రోజు బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. బుధవారం కాజులూరులో జరిగిన ఆడుదాం ఆంధ్రా వాలీబాల్ పోటీలను మంత్రి వేణుగోపాలకృష్ణ ప్రారంభించారు. ఇక్కడి జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీపీ మాత భారతి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ప్రభుత్వం ఈ పోటీలు నిర్వహిస్తుందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు చదువుతో పాటు క్రీడలు ఎంతగానో దోహదపడతాయన్నారు. గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.125 కోట్లు వెచ్చించి ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారన్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యాళ్ల సత్తిబాబు, దంగేటి అరుణ్‌కుమార్, సర్పంచ్ దండంగి చిన్నారావు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పీవీఆర్ క్రీడా ప్రాంగణంలో ఆడుదాం ఆంధ్రాలో భాగంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ పోటీల్లో మహిళలు, యువతీ, యువకులు జోరుగా, హుషారుగా పాల్గొన్నారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, వ్యాయామ ఉపాధ్యాయులు గెద్దం అనురాధ, కోశెట్టి శ్రీనివాస్, ఎ.ఉమ, సీహెచ్ సుజాత, తోట నాగమణి, జీవీ గోవిందమ్మ ఈ పోటీలను పర్యవేక్షించారు.


ద్రాక్షారామలో ఉత్సాహంగా కబడ్డీ ఆడుతున్న మహిళలు


కపిలేశ్వరపురంలో క్రీడాకారులను అభినందిస్తున్న పృథ్వీరాజ్

క్రీడలకు అధిక ప్రాధాన్యం

కపిలేశ్వరపురం: క్రీడలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ యువనేత, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని కపిలేశ్వరపురం, అంగర తదితర గ్రామాల్లో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా వేదికలను ఆయన సందర్శించారు. టాస్ వేసి ఆటలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని ప్రోత్సహించారు. పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసిన అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను అభినందించారు. కాగా అంగర, కపిలేశ్వరపురం, తాతపూడి, వెదురుమూడి, నేలటూరు, వల్లూరు, నిడసనమెట్ట, వడ్లమూరు, అచ్యుతాపురం, కాలేరు, నల్లూరు, టేకి, మాచర, కోరుమిల్లి తదితర గ్రామాల్లో పలు విభాగాల్లో క్రీడా పోటీలను నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు శీలం భాస్కరరావు, మేడిశెట్టి దుర్గారావు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కట్టా మురళి, వంగా నల్ల శ్రీను, పాలింగి శ్రీనివాస్, బంటుమిల్లి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై సమీక్ష

రామచంద్రపురం: స్థానిక రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ మోనిటరింగ్ విజిలెన్స్ కమిటీ సమావేశాన్ని ఆర్డీఓ ఎస్.సుధా సాగర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ పెండింగ్ కేసులపై సమీక్షించారు. నాలుగు తప్పుడు కేసులు, మిగిలిన కొన్ని ఎఫ్ఐఆర్ స్థాయి, మరికొన్ని ఛార్జిషీట్ స్థాయిలలో ఉన్నాయని వివరించారు. పెండింగ్ ప్రతిపాదనలను వెంటనే పంపించాలని మండల తహసీల్దార్‌లను ఆర్డీఓ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, సీఐ దుర్గారావు, డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్, కమిటీ సభ్యులు పీడీవీఆర్ గంగాధరరావు, బి.సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుక.. ఆనందాల గీతిక


ఆదివారపుపేట రాక్ చర్చిలో చిన్నారుల ప్రదర్శన

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఆదివారపుపేట రాక్ చర్చిలో మంగళవారం రాత్రి క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. చర్చి పాస్టర్ బిషప్ కనికెళ్ల ఆనంద్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రీస్తు చూపిన ప్రేమ, దయ, కరుణలను ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలన్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అర్ధరాత్రి వరకూ చిన్నారులు, యువతీ యువకులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ నక్కిన దొరబాబు, ఎంపీటీసీ సభ్యుడు బళ్ల సుధాకరరావు, చర్చి పాస్టర్లు కనకరత్నం, కె.బేబీ రత్నకుమారి, సంఘ పెద్దలు, వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు.


కపిలేశ్వరపురం: తాతపూడిలోని గోపాలరావుపేటలో జీసస్ ప్రేయర్ హౌస్‌లో క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. పాస్టర్ రాపాక పాల్ ఆధ్వర్యంలో క్రైస్తవ ప్రబోధకులు జీవన్ జోయ్, ప్రవీణ్ జోయ్‌లు క్రీస్తు బోధనలను వివరించారు. సర్పంచ్ గూటం శ్రావణి, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, క్రైస్తవులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనులు


కపిలేశ్వరపురంలో క్షేత్ర స్థాయి పనులపై నివేదిస్తున్న తనిఖీదారు

కపిలేశ్వరపురం: మండలంలో 2022–23 సంవత్సరంలో రూ.6.14 కోట్ల విలువైన పనులను జాతీయ ఉపాధి హామీ పథకంలో పారదర్శకంగా పూర్తి చేసినట్లు డ్వామా పీడీ మధుసూదనరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం సామాజిక తనిఖీ ప్రజావేదికలో గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను తనిఖీ చేశారు. గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల ద్వారా రైతులు ప్రస్తావించిన ప్రతిపాదనలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. క్షేత్ర స్థాయిలో నెలకొన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని మండల స్థాయి అధికారులకు సూచించారు. ఎస్ఆర్పీ సత్యనారాయణ, విజిలెన్స్ ఏపీడీ కె.సత్యనారాయణ, అంబుడ్స్‌మెన్ అధికారి జ్యోతి మాట్లాడుతూ మండలంలో రూ.6.14 కోట్లతో 1,102 పనులు చేపట్టారన్నారు. పలు గ్రామాల్లో గతంలో నాటిన మొక్కలు ఉనికిలో లేకపోవడాన్ని గుర్తించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, ఏపీఓ బి.వెంకటలక్ష్మి, పీఆర్ జేఈ డీవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నాభిషేకం


సోమేశ్వరస్వామికి అన్నాభిషేకం చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు

రాయవరం: సోమేశ్వరంలో వేంచేసి ఉన్న బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి వారికి బుధవారం అన్నాభిషేకం నిర్వహించారు. మహాశివుని జన్మ నక్షత్రం ఆరుద్రను పురస్కరించుకుని అన్నాభిషేకం చేశారు. ఆలయ అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో పరిటాల సోమశేఖర శర్మ, పెదపూడి అయ్యప్ప దీక్షితులు తదితరుల అర్చకత్వంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నాన్ని భక్తులకు ప్రసాదంగా అందజేశారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో నయనానందకరంగా అలంకరించారు. సర్పంచ్ ఆరిఫ్, ఆలయ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, ఈఓ అయ్యప్పరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో డిజిటల్ విప్లవం


ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

రాయవరం: విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. రాయవరం శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం వీఎస్ సునీత అధ్యక్షతన బైజూస్ ట్యాబ్‌ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, వెంకటరమణ మాట్లాడుతూ విద్యా రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంతో పాఠశాలల రూపురేఖలు మారిపోయాయన్నారు. ఎంఈఓలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు 101 ట్యాబ్ పంపిణీ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు తమలంపూడి గంగాధరరెడ్డి, పడాల కమలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్నోయగం


చెట్టు ఆకులపై కమ్ముకున్న పొగ మంచు

కె.గంగవరం: నాలుగు రోజుల నుంచి మంచు విపరీతంగా కురుస్తోంది. చలి పులిని ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లేవారు, ప్రకృతి ప్రేమికులు పచ్చని వరి చేలపై, రహదారిపై కమ్మేసిన మంచును చూసి ఆనందం వ్యక్తం చేస్తూ పొగ మంచు సోయగాలను తమ సెల్ ఫోన్‌లలో బంధిస్తున్నారు. పామర్రు– కురకాళ్లపల్లి రహదారిలో రోడ్డు పక్కనే చెట్టు ఆకులకు రక్షణ కల్పిస్తున్నట్లు పొగ మంచు ఇలా కప్పేసి ఆహుతులను ఆకట్టుకుంటోంది.